క్లుప్తంగా

ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం



జొన్నగిరిలో పరీక్షలు రాస్తున్న 9వతరగతి విద్యార్థులు

తుగ్గలి : సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పరీక్షలు బుధవారం అన్ని పాఠశాలల్లో ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. తుగ్గలిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్షలను ఎంఈఓ-2 రామ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. వచ్చేనెల 4వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని ఆయన తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు అంచనా వేసేందుకు విద్యాశాఖ ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు ఆస్పరి మార్కెట్ వేలం

ఆస్పరి: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం సర్పంచ్ మూలింటి రాధమ్మ అధ్వర్యంలో ఆస్పరి దినసరి కూరగాయల మార్కెట్ హక్కుల కోసం వేలం నిర్వహించునున్నట్లు పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్ బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ. 2లక్షల డిపాజిట్, రూ.5 లక్షలకు సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకు రావాలని సూచించారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: విశాఖ పట్టణంలో సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం ఆస్పరిలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల పోస్టర్లును నాయకులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, ఉరుకుందప్ప, గోవిందు, పాండు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి: ఈనెల 29వ తేదీన స్థానిక కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ మిద్దె రంగయ్య అధ్యక్షతన జరిగే సమావేశంలో మండల సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టబోయే పనులు, అనుమతులు, మండలంలోని పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు. అలాగే వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్షిస్తామన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

మొక్కుబడిగా మండల మీట్

దేవనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన, ఎంపీడీఓ గౌరీదేవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. పారిశుద్ధ్య పనులు, రోడ్ల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం తదితర వాటిపై అధికారులు చర్చించారు.

సాగునీటి సమస్యపై ప్రజాప్రతినిధులు స్పందించాలి

దేవనకొండ: మండలంలో రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై మండల ప్రజాప్రతినిధులు స్పందించాలని, పరిష్కారానికై కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించారు. బి.వీరశేఖర్ మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు కరివేముల-తెర్నేకల్ మధ్యన, కప్పట్రాళ్ల దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలన్నారు. గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేయడం ద్వారా 10 వేల ఎకరాలకు అదనంగా సాగునీరు, మండలంలోని చెరువులకు నీరు మళ్లించే అవకాశం ఉందన్నారు. సూరి, మహబూబ్‌బాషా, యూసుఫ్‌బాషా, సుధాకర్, కౌలుట్ల, మార్కండేయులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆదోని రూరల్: సెప్టెంబర్ 14వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ సూచించారు. బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో ఆదోని పట్టణంలోని సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లతో సమావేశమయ్యారు. జడ్జి మాట్లాడుతూ.. రాజీకాదగిన కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఏఏ స్టేషన్‌లలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసులు రాజీ చేయగలరో గుర్తించి కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు పరిష్కరించడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో జ్యూడిషియల్ ఆఫీసర్స్, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి జి.అర్చన, మొదటి శ్రేణి అదనపు న్యాయమూర్తి సాయిలీలా సుభాష్, రెండో శ్రేణి అదనపు న్యాయమూర్తి కుమారి సాయి శ్రీవల్లి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్‌కె. సుందర్‌సింగ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టం అవసరం



మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలి. కోల్‌కతా ఘటనను దృష్టిలో ఉంచుకుని అలాంటివి పునరావృతం కాకుండా, ఎక్కడా జరగకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సి ఉంది. సంఘటనలపై కఠినంగా వ్యవహరిస్తే నేరాలు అదుపులోకి వస్తాయి. రోగుల ప్రాణాలు కాపాడే వారికి అండగా ఉన్నామని ప్రభుత్వం ధైర్యం కల్పించాలి.

– శ్రీకాంత్, చిన్న పిల్లల వైద్యుడు,ఆలూరు



భద్రతకు భరోసా ఇవ్వాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేసే మహిళా వైద్యులు, సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి. అలా చేసినప్పుడే మహిళలు స్వేచ్ఛగా విధులు నిర్వర్తించగలుగుతారు. కోల్‌కతా ఘటన చాలా దారుణం. ఇలాంటి ఘటనలు జరిగిన ప్రభుత్వాలు వెంటనే స్పందించి విచారణ పూర్తి చేసి, నిందితులను కఠినంగా శిక్షిస్తే ఘటనలు పునరావృతం కావు.

– డాక్టర్ దుర్గాబాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,ఆస్పరి

పనిచేయవు..పనికిరావు!

- నిరుపయోగంగా వాటర్ ఏటీఎంలు
- బిల్లులు చెల్లించని ఏజెన్సీలు
- పాడైపోతున్న యంత్రాలు
- బోర్లను ఆశ్రయిస్తున్న జనం
- పట్టించుకోని యంత్రాంగం

ఫ్లోరైడ్ నీటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించి శుద్ధ జలం అందించాలని కోట్లాది రూపాయలతో నిర్మించిన శుద్ధజల కేంద్రాలు మూతపడ్డాయి. ఏజెన్సీలు సరిగా బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వహణ భారమై నీటి సరఫరాను నిలిపివేశాయి. దీంతో జనం మళ్లీ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా.. కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన యంత్రాలు పనికి రాకుండా పోతున్నాయి.



ఉప్పర్లపల్లి వద్ద నిర్మించిన మదర్ ప్లాంట్



పెండేకల్లులో నిరుపయోగంగా మారిన వాటర్ ఏటీఎం

తుగ్గలి : సంపూర్ణ ఆరోగ్యం కోసం స్వచ్ఛమైన నీటిని అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆర్‌డీ (రిమోట్ డిస్పెన్సింగ్) యూనిట్లు ఏడాదిగా మూతపడ్డాయి. నియోజవర్గంలోని వెల్దుర్తి, కృష్ణగిరి, తుగ్గలి మండలాల్లో రూ.9.62 కోట్లు ఖర్చు చేసి మదర్ ప్లాంట్లు, ఆర్‌డీ యూనిట్లు ఏర్పాటు చేసినా లక్ష్యం నెరవేరలేదు. 2018 చివరలో చేపట్టిన పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఆ తర్వాత ప్రభుత్వం పెండింగ్ పనులు పూర్తి చేసి రెండేళ్లకు పైగా పాటు ప్రజలకు మినరల్ వాటర్ అందించింది. తుగ్గలి మండలం ఉప్పర్లపల్లి, కృష్ణగిరి, వెల్దుర్తిలో మదర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఈ మదర్ ప్లాంట్ల ద్వారా తుగ్గలి మండలంలో 22 గ్రామాలకు, కృష్ణగిరి మండలంలో 18 గ్రామాలకు, వెల్దుర్తి మండలంలో 21 గ్రామాలకు మినరల్ వాటర్ సరఫరా చేసేవారు. ఆయా పంచాయతీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌డీ యూనిట్ల వద్ద ప్రజలు ఏటీఎం లాంటి కార్డుల ద్వారా 20 లీటర్లు రూ.4 చొప్పున చెల్లించి మినరల్ వాటర్‌ను తీసుకెళ్లేవారు. రెండేళ్లకు పైగా సరఫరా సక్రమంగా జరిగింది. క్రమంగా వాటర్ సరఫరా చేసే సిబ్బందికి వేతనాలు, ట్రాక్టర్ల మెయింటెన్స్ బిల్లులు కాంట్రాక్టర్ సరిగా ఇవ్వకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఉప్పర్లపల్లి మదర్‌ప్లాంట్ పరిధిలో రూ.3 లక్షలు రావాల్సి ఉందని సిబ్బంది చెబుతున్నారు. బిల్లుల పెండింగ్‌తో మినరల్ వాటర్ సరఫరా ఆగిపోయింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోయింది. ఏడాదిగా ప్లాంట్లు పని చేయకపోవడంతో అందులో యంత్రాలు పాడైపోతున్నాయి. కోట్లాది సొమ్ము వృథా అయ్యిందంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. నిర్వహణ బాధ్యతలు ఓ ఏజెన్సీకి అప్పగించడంతో శుద్ధ జల కేంద్రం మూతపడింది. ఏజెన్సీ నుంచి స్పందన కరువవడంతో అధికారులు కూడా ఏమీ చేయలేక మిన్నకుండి పోయారు. శుద్ధజలం సరఫరాపై ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి శుద్ధజలం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు చాలా బాగుండేవి



మినరల్ వాటర్ చాలా బాగుండేవి. రెండేళ్లకు పైగా బాగానే సరఫరా చేశారు. అంతా మినరల్ వాటర్‌కు అలవాటు పడ్డారు. కార్డులు కొని ట్యాంకుల వద్ద నీళ్లు తీసుకెళ్లేవాళ్లం. మినరల్ వాటర్ సరఫరా నిలిచిపోవడంతో బోరు నీళ్లు తాగుతున్నాం. మినరల్ వాటర్‌ను సరఫరా చేస్తే బాగుంటుంది.

– నాగేశ్వరరావు, పెండేకల్లు

బోరు నీటిని వినియోగిస్తున్నాం



మినరల్ వాటర్ ప్లాంట్ మూతపడడంతో బోర్ల నీరే దిక్కయ్యింది. ఒక్కోసారి బైక్‌పై పక్క గ్రామానికి వెళ్లినప్పుడు మినరల్ వాటర్ తెచ్చుకుంటాం. ఊళ్లో వాటర్ ఏటీఎంలు పనిచేసే సమయంలో కార్డుల ద్వారా ఆ నీటిని తెచ్చుకుని వినియోగించాం. మినరల్ వాటర్ సరఫరాను పునరుద్ధరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వీరభద్రి, రామాపురం

త్వరలో వినియోగంలోకి తెస్తాం

వాటిని త్వరలో వినియోగంలోకి తీసుకొస్తాం. ప్రస్తుతానికి గ్రామ పంచాయతీలకు అప్పగిస్తున్నాం. కొత్త ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రజలకు శుద్ధజలం సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ కోసం వేచిఉన్నాం.

– మహబూబ్‌ఖాన్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పత్తికొండ

ఉపాధి నిధులతో సీసీ రోడ్లు

తుగ్గలి: మండల కేంద్రంలో ఉపాధి నిధులు రూ.24లక్షలతో సీసీ రోడ్లు వేస్తామని సర్పంచ్ రవి, గౌరవ సలహాదారు నాగేంద్ర తెలిపారు. బుధవారం స్థానిక రాముల దేవాలంయలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. నాగేంద్ర మాట్లాడుతూ శ్రీరాముల దేవాలయ నూతన తేరు నిర్మాణం కోసం తాను రూ.12.50 లక్షలు విరాళం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి రూ.5 లక్షలు అడ్వాన్స్‌గా నిర్మాణ కార్మికులకు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి రాజునాయక్, వీఆర్వో రహిమాన్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

45 శాతం పంట నమోదు పూర్తి

కృష్ణగిరి: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 45 శాతం పంట నమోదు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం కృష్ణగిరి, తొగర్చేడు తదితర గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదును పరిశీలించారు. అన్ని పంచాయతీల్లో ఇప్పటి వరకు 29,499 ఎకరాల్లో పంట నమోదు పూర్తి చేశామన్నారు. మిగిలిన రైతులు కూడా త్వరగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి రాయితీ లు పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

ఎయిడ్స్‌పై అవగాహన

హాలహర్వి: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్డీప్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మాలిక్ సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మీకు తెలుసా' అనే కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు చూడరాదన్నారు. హాలహర్వి పీహెచ్‌సీ డాక్టర్ తిమ్మయ్య, హెచ్‌ఎం ఉశేని, ఆర్డీప్ సిబ్బంది, ఏఎన్‌ఎం అనిత, ఓఆర్‌డబ్ల్యూలు రంగన్న, కవిత, మల్లికార్జున, బి.వెంకటేష్, ఎం.తులసి పాల్గొన్నారు.

వేడుకగా కృష్ణాష్టమి



తుగ్గలి శ్రీకృష్ణ మందిరంలో చేపట్టిన పూజల్లో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

తుగ్గలి : త్రైత సిద్ధాంత ప్రబోధానంద సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపు తుగ్గలిలో వేడుకగా నిర్వహించారు. జన్మాష్టమి సందర్భంగా గ్రామంలో కృష్ణుని ప్రతిమను ప్రతిష్ఠించి మూడు రోజుల పాటు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం భక్తులతో పాటు ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, ఆర్ సుధాకరరెడ్డి, వీఆర్వోలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తహసీల్దార్, వీఆర్వోలు కృష్ణుడి పల్లకీని మోసి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు



మాట్లాడుతున్న ఎంపీపీ జూటూరు హేమలత

చిప్పగిరి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని ఎంపీపీ జూటూరు హేమలత అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ బాలన్న, సర్పంచ్ గోవింద రాజులు, ఎంపీటీసీలు రజనీ, సుంకన్న, భీమలింగ, పాల్గొన్నారు.

హాస్టల్‌ను పునః ప్రారంభించాలి

దేవనకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను పునః ప్రారంభించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఆయన మట్లాడుతూ దేవనకొండలో 40 సంవత్సరాలుగా డీఎస్టీ హాస్టల్ ఉండేదని, పక్కా గృహం లేదని, దీంతో నిర్వహణ లోపంతో మూసి వేశారన్నారు. ఇప్పటికైనా హాస్టళ్లను పునః ప్రారంభించి విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాలని కోరారు. సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్, నాయకులు ఉమేష్, సురేంద్ర, అభి, మహేష్ పాల్గొన్నారు.

రాజీ మార్గానికి వేదిక లోక్ అదాలత్



కక్షిదారులకు లోక్ అదాలత్ నోటీసు అందిస్తున్న ఎస్‌ఐ నరసింహులు

ఆలూరు రూరల్: వివిధ కేసుల్లో ఉన్న కక్షిదారుల రాజీ మార్గానికి లోక్ అదాలత్ సత్వర వేదికని ఆలూరు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో వివిధ కేసులలో నిందితును పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 14వ తేదీన నిర్వహించే మెగా లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకోవాలని సూచించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడటం, గ్రామాల్లో తగాదాలు పడి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుని కోర్టులు చుట్టూ తిరిగి జైళ్లకు వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కష్టపడి పనిచేసి పిల్లలను బాగా చదివించుకోవాలని చెప్పారు.

తీర్మానం లేకుండా నిర్మాణాలు చేపట్టరాదు



మాట్లాడుతున్న ఈఓ శివకుమార్

మద్దికెర : గ్రామంలో పంచాయతీ తీర్మానం లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈఓ శివకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులు లక్ష్మీనారాయణ, బాలచంద్ర, జంబునాథ్ రాయుడు మాట్లాడుతూ గ్రామంలో చాలామంది పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, అలాగే రోడ్డుపై అడ్డంగా బంకులు వెలుస్తున్నా పట్టించుకోవడం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ తీర్మానం చేసిన తర్వాతే కట్టడాలు చేపట్టాలని, లేనియెడల ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడమే గాకుండా కూల్చి వేస్తానమని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములేని అందరూ సహకరించినపుడే అభివృద్ధి సాధ్యమవుతందని చెప్పారు. చివరగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చదివి వినిపించారు. ఉపసర్పంచ్ ప్రమీలమ్మ, సభ్యులు వరప్రసాద్, సచివాలయ ఈఓలు అరుణ కుమారి, అనూషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



విద్యార్థినికి నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే బి. విరూపాక్షి



వాల్మీకి భవన్‌కు కేటాయించిన స్థలం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

హొళగుంద: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకొని కన్నవారి కలలను నెరవేర్చాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గతేడాది జూనియర్ ఇంటర్ సీఈసీలో జిల్లా టాపర్‌గా నిలిచిన జే.మేఘనకు రూ.10 వేల నగదును బహుమతిగా అందజేశారు. తరగతి గదులన్నీ కలియదిరిగి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేను కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు సత్కరించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ..

స్థానిక వారపు సంత మార్కెట్ వెనుక మచ్చావలి అంగడి నుంచి బీసీ కాలనీ వరకు రూ.5 లక్షల జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, కోగిలతోట శేషప్ప, మాజీ సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున, ఎస్కే గిరి, ఎంపీటీసీ మల్లి, హనుమప్ప, మౌనేష్, రవి, శంబులింగ, పంపాపతి, కాకి ఫక్కీరప్ప, సోమిరెడ్డి, షేక్షావలి ఉన్నారు.

హొళగుంద: స్థానిక ఆదోని రోడ్డులోనున్న వాల్మీకి భవన్‌కు కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. అంతకు ముందు వాల్మీకి చిత్రపటానికి పూజలు చేసి స్థలం విషయంలో సహకరించిన పవనాచారిని సత్కరించారు. అనంతరం వారపుసంత మార్కెట్ పక్కన ఏర్పాటు చేసిన సూపర్ మార్కెట్‌ను ప్రారంభించారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో చింతముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల సందర్భంగా ఈనెల 15న తెల్లవారుజామున జరిగిన బాణ సంచా పేలుడులో గాయపడిన బడెప్ప (61) మంగళవారం రాత్రి రాయచూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఆస్పరి సీఐ మస్తాన్ వలి బుధవారం తెలిపారు. మృతుడి స్వగ్రామం రాయచూర్ జిల్లా దిన్నె. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. ఈ సంఘటనలో మొత్తం 17 మంది గాయపడగా.. రాయచూర్ జిల్లా మంచాలపురం గ్రామానికి చెందిన గోవిందమ్మ, అలంపూర్‌కు చెందిన పద్మ, దిన్నె గ్రామానికి చెందిన బడెప్ప మృతి చెందారని సీఐ వివరించారు.

బంగారు గొలుసు చోరీ

కర్నూలు: కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో బ్యాంకు ఉద్యోగి బ్యాగులో బంగారు గొలుసు మాయమైంది. దేవనకొండ మండలం నల్లచెలిమల గ్రామానికి చెందిన నాగరాజు ప్రకాశం జిల్లా దోర్నాల ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తున్నారు. ఈయన కుటుంబ సభ్యులతో కలిసి సెలవులకు స్వగ్రామం నల్లచెలిమలకు వచ్చి తిరిగి దోర్నాలకు వెళ్లేందుకు బుధవారం కర్నూలు బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగులో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును తస్కరించారు. కొద్దిసేపు తర్వాత గుర్తించిన నాగరాజు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోసిగి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న కోసిగి గ్రామానికి చెందిన బోయ నాగరాజును అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి పల్సర్ మోటార్ సైకిల్, 5 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.





బాపురంలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం, ప్రత్యేక అలంకరణలో సీతారాములు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

హాలహర్వి: బాపురం గ్రామంలోని శ్రీ రామాలయంలో బుధవారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ఆకు పూజలు, పంచామృతాభిషేకం, పాలాభిషేకం, గణపతిపూజ తదితర విశేష పూజలు చేపట్టారు. అనతరం గంగాజలంతో ధ్వజస్తంభానికి జలాభిషేకం చేసి పండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠ కార్యక్రమం పూర్తి చేశారు. భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జె.హొసళ్లి పట్టాదస్వామి మఠం పీఠాధిపతి శంభులింగ మరిదేవరు, ఎంపీటీసీ సభ్యులు ప్రహ్లాదరెడ్డి, గ్రామస్తులు గుండయ్య స్వామి, నాగేంద్ర, నాగన్నగౌడ్, పంపన్నగౌడ్, చెన్నప్ప పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించండి



మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మద్దికెర : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప పంటలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏఓ రవి తెలిపారు. బుధవారం మండల కేంద్రం పరిసరాల్లో సాగైన మిరప పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..పై ముడత నివారణకు ఫిప్రోనిల్ , ఇమిడోక్లోపిడ్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా ఫిప్రోనిల్, డయోమిదాక్సమ్ 1.25 మి.లీను లీటర్.. లేదంటే జంప్ ఎకరాకు 40 గ్రాములు పిచికారీ చేయాలని చెప్పారు. కింది ముడత(నల్లి) నివారణకు ప్రాపగైట్ 2 మి.లీ లీటర్ నీటికి, అబాసిన్ లీటర్ నీటికి 1 మీ.లీ , స్పైరోమెసిఫిన్ లీటర్ నీటికి 1 మి.లీ, సైనో ఫైరోఫిన్ లీటర్ నీటికి 0.4 మి.లీ పిచికారీ చేయాలని సూచించారు. ఒకవేళ పైముడత, కింది ముడత ఉంటే మొవెంటో లీటర్ నీటిలో 1 మి.లీ కలిపి స్ప్రే చేయాలి. పూతలో పురుగులు ఉంటే కార్బోసల్ఫాన్ లీటర నీటికి 2 మి.లీ, లేదా ఫ్లూబెండామైడ్ లీటర్ నీటికి 0.3 మి.లీ వాడాలన్నారు. నల్లతామర తెగులు సోకితే బ్రోఫ్లినామైడ్ ఎకరాకు 34 మి.లీ, లేదా ఫ్లక్సామెటామైడ్ ఎకరాకు 160 మి.లీ పిచికారీ చేయాలని వివరించారు.